# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-11-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈరోజు, రేపు తిరుపతి–తిరుమలలో పర్యటిస్తారు.**
2. **రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అన్ని అనుమతులు ఒకే చోట లభించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.**
3. **ప్రభుత్వ వసతి గృహాలు, గురుకులాలలో మరమ్మతులకు 200 కోట్ల రూపాయలను కేటాయించామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు.**
4. **గోవాలోని పణజీలో 56 వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం –ఇఫీ ఈరోజు ప్రారంభమైంది.**

==========================

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈరోజు, రేపు తిరుపతి, తిరుమలలో పర్యటిస్తారు. ఈరోజు మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం చేరుకోనున్న రాష్ట్రపతి అక్కడి నుండి రోడ్డు మార్గాన బయలుదేరి తిరుచానూరులో శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకుంటారు. అమ్మవారి దర్శనం అనంతరం తిరుమలలోని పద్మావతి అతిథి గృహానికి చేరుకుని రాత్రికి అక్కడే బస చేస్తారు. రేపు ఉదయం వరాహా స్వామిని దర్శించుకున్న అనంతరం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకుంటారు. దర్శనానంతరం హైదరాబాద్ తిరుగు ప్రయాణం కానున్నారని అధికారులు తెలిపారు.

--------------------------

కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పుట్టపర్తిలోని సత్యసాయిబాబా మహాసమాధిని ఈరోజు దర్శించుకున్నారు. ప్రశాంతి నిలయానికి వచ్చిన కేంద్రమంత్రికి సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ స్వాగతం పలికారు. సాయి కుల్వంత్ సభా మందిరానికి వచ్చిన కేంద్రమంత్రి రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, సత్య కుమార్ యాదవ్ కలిసి సత్యసాయిబాబాకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నితిన్ గడ్కరీ మాట్లాడుతూ, సత్యసాయి బాబా జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని, ఆయన చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు.వ్యక్తిత్వ వికాసానికి విద్య దోహదం చేస్తుందని నితిన్ గడ్కరీ పేర్కొంటూ,

వాయిస్ .. 32 సెకన్లు

--------------------------

రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకునేవారికి అన్ని అనుమతులు ఒకే చోట లభించేలా చర్యలు తీసుకుంటున్నామని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పరిశ్రమల శాఖపై సంబంధిత అధికారులతో దృశ్య మాధ్యమ విధానంలో ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఎంఎస్ఎంఈల అభివృద్ధి కార్యాచరణ, క్షేత్ర స్థాయిలో అధికారుల పనితీరుపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎంఎస్ఎంఈలకు అందిస్తున్న ప్రోత్సాహం, నూతన పరిశ్రమల ఏర్పాటకు చేపడుతున్న కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. క్లస్టర్ల ఏర్పాటుకు చేపడుతున్న కార్యక్రమాలు, ఎంఎస్ఎంఈ పార్కుల నిర్మాణంలో ఏ విధంగా ముందుకు వెళ్ళాలనే అంశాలపై మంత్రి దిశా నిర్దేశం చేశారు.

---------------------------

విశాఖపట్నం భాగస్వామ్య సదస్సులో కుదిరిన 8 ఒప్పందాల ద్వారా ఐదు జిల్లాల్లో టెక్స్టైల్స్ పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం, చిత్తూరు, గుంటూరు, శ్రీసత్యసాయి, అనకాపల్లి జిల్లాల్లో పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడిదారులు ముందుకొచ్చారన్నారు. వీటిద్వారా 6 వేల 460 మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశాలున్నాయని మంత్రి వెల్లడించారు.

---------------------------

ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా దేశాన్ని తీర్చిదిద్దడంలో భారత కంప్ట్రోలర్, ఆడిటర్ జనరల్– కాగ్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని ప్రిన్సిపల్ అకౌంట్ జనరల్ శాంతి ప్రియ పేర్కొన్నారు. ఆడిట్ దివస్ సందర్భంగా విజయవాడ కాగ్ కార్యాలయంలో ఆడిట్ అవగాహన వారోత్సవాలను ఆమె ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా శాంతి ప్రియ మాట్లాడుతూ ఈ ఈరోజు నుంచి 28 వరకు ఆడిట్ దివస్ వారోత్సవాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. డిజిటల్ సాంకేతికత ద్వారా ఆడిటింగ్‌లో మరింత విశ్వసనీయత, ఖచ్చితత్వాన్ని కొనసాగించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు ఆడిటింగ్ దోహదపడుతుందని తెలిపారు.

---------------------------

ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలలో మరమ్మతులకు 200 కోట్ల రూపాయలను కేటాయించామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. అమరావతిలో ఈరోజు ఆయన మాట్లాడుతూ.. వసతి గృహాలు, గురుకులాల్లో అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని చెప్పారు. అన్ని వసతి గృహాలు, గురుకులాలలో నీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని మంత్రి తెలుపుతూ,

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

గోవాలోని పణజీలో 56 వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం –ఇఫీ ఈరోజు ప్రారంభమైంది. ఈ నెల 28వ తేదీ వరకు జరిగే ఈ చలన చిత్రోత్సవంలో 81 దేశాలకు చెందిన 240కి పైగా చలన చిత్రాలు ప్రదర్శిస్తారు. ఇఫీలో భాగంగా నిర్వహిస్తున్న వేవ్స్ ఫిల్మ్ బజార్‌ను కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్.మురగన్ ప్రారంభించారు.

ఇక మొదటి రోజు ఇఫీ చిత్రోత్సవ ప్రారంభం సందర్భంగా ఈరోజు సాయంత్రం “భారతీయ సినిమా వారసత్వం” ఇతివృత్తంతో పణజీలో వివిధ రాష్ట్రాల సాంస్కృతిక బృందాలతో ప్రదర్శన జరుగుతుంది.

---------------------------

ప్రపంచ బాలల దినోత్సవం ఈరోజు నిర్వహిస్తున్నారు. పిల్లల సంక్షేమం పట్ల అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు ప్రతి ఏటా నవంబర్ 20వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతుంది. పిల్లల ఎదుగుదలకు అవసరమైన పౌష్టికాహారం అందేలా చూడటం వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దడం, ప్రపంచవ్యాప్తంగా వివిధ అంశాలపై వారికి విజ్ఞానాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమ నిర్వాహణలో ముఖ్య ఉద్దేశం.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 128వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.“మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 28వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

ఆగ్నేయ బంగాళాఖాతంలో శనివారం అల్పపీడనం ఏర్పడనుందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ వాయుగుండంగా బలపడనుందని తెలిపింది. దీని ప్రభావంతో ఈరోజు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి బి.శేఖర్ తెలియజేస్తూ...

..వాయిస్.. 19 సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని పల్నాడు జిల్లా, కారంపూడిలో పల్నాటి వీరుల ఆరాధనోత్సవాలు నిన్న ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో తొలి రోజు రాచగావును నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నకేశవ స్వామి, అంకాలమ్మ అమ్మవారికి శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి ఎడ్ల బండి పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పల్నాటి యుద్ధంలో ప్రాణత్యాగం చేసిన వీరులను స్మరించుకుంటూ వారి ఆయుధాలకు పూజలు చేసే సాంప్రదాయ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ రోజు రాయబారం, రేపు మందపోరు, 22న కోడిపోరు, 23న కల్లిపాడు కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

---------------------------

ఫిన్లాండ్ దేశంలో అమలవుతున్న ‘ఆట ఆధారిత అభ్యాసం’ విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయనున్నట్లు విద్యాశాఖ వెల్లడించింది. ఇందులో భాగంగా జిల్లాకు ఒక అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ శిశువిద్య అమలుకు సహకారం అందించేందుకు ఫిన్నిష్ నేషనల్ ఏజెన్సీ ఫర్ ఎడ్యుకేషన్ ఆమోదం తెలిపినట్లు పేర్కొంది. మానవ వనరుల అభివృద్ధిశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఆధ్వర్యంలో ఐఏఎస్ అధికారులు నారాయణ భరత్ గుప్తా, విజయరామరాజు, బి.శ్రీనివాసరావు, గణేష్ కుమార్‌లతో కూడిన బృందం ఇటీవల ఫిన్లాండ్‌లో పర్యటించి అక్కడి విద్యావ్యవస్థపై అధ్యయనం చేసి వివరాలు వెల్లడించింది.

====================